# మెర్సీ కిల్లింగ

ఉమ్మడి రవీంద్రనాథ్

వంట పని ముగించి డైనింగ్ టేబిల్ మీది గిన్నెలన్నీ కుదురుగా సర్ది హాల్లోకి వచ్చింది శ్రీలక్ష్మి. అంతవరకూ అక్కడే సోఫాలో కూర్చుని న్యూస్‌పేపర్ని చింపి దాన్తో గాలిపటం తయారుచేయాలని విఫల ప్రయత్నం చేస్తున్న అనిల్ అక్కడ లేదు.

"ఎక్కడ తగలడ్డాడు ఈ శనిగ్రహం" గొణుక్కుంటూ పడగ్గది తలుపు తెరిచి, లోపల వెదికింది. లేదు. ఒకవేళ టెర్రస్ మీదికి వెళ్ళాడేమోనని గబగబ మెట్లెక్కి పైకి వెళ్ళింది. అక్కడా లేకపోయేసరికి అప్పుడు కలిగింది ఆమెలో కాస్త ఆదుర్దా. 'కొంపదీసి గాలిపటం ఎగరేసుకోవడానికి బయట రోడ్ల మీదికి వెళ్ళలేదు కదా'



తిరిగి హాల్లోకి వచ్చి "అనిల్" అని గట్టిగా కేక పెట్టింది. "ఛి ... ఛి ... ఛి ... ఈ మొద్దు వెధవకి కాపలా కాయడం పెద్ద చావైపోయింది" విసుగు పేరుకుంటోందామెలో. ఇంకోసారి కేక వేయబోతుండగా వినిపించింది — భళ్ళున ఏదో క్రింద పడ్డ శబ్దం వంట గదిలోంచి. దాదాపు పరిగెత్తుతున్నంత వేగంగా కిచెన్‌లోకి వెళ్ళి చూసింది శ్రీలక్ష్మి.

అంతకు ముందే డైనింగ్ టేబిల్ మీద సర్ది వుంచిన పాత్రలన్నీ చిందరవందరైపోయి వున్నాయి. కేస్సరోల్‌లో వుంచిన అన్నం వొలికిపోయి కింద గచ్చుమీద పడింది.

తను తయారుచేసిన గాలిపటానికి తోకని అంటించాలని అన్నం మెతుకుల కోసం వచ్చి ఈ నిర్వాకం చేశాడని అర్థమైపోయింది శ్రీలక్ష్మికి — అనిల్ చేతిలో కాగితం ముక్క (గాలిపటం)ని చూడగానే! బెదుర్తున్న కళ్ళతో శ్రీలక్ష్మి వైపు చూస్తున్నాడు అనిల్. ఆమె ఒక్కో అడుగూ ముందుకేస్తుంటే, వాడు భయంతో వెనక్కి జరుగుతున్నాడు. తను శ్రమపడి చేసి సర్దిన వన్నీ క్షణంలో అలా చెల్లా చెదురు చేశాడన్న కోపంతో, వాడి చేతిని పట్టి గుంజి చెంపల మీద ఛేళ్ ఛేళ్న వాయించేసింది శ్రీలక్ష్మి. కళ్ళల్లోంచి ఒలికిపోతున్న నీరు అనిల్ బుగ్గల మీదినుండి మౌనంగా రాల్తోంది. వేడి వేడి అన్నం పెట్టిన కేస్సరోల్ మూత ఆవిరివల్ల బిగుతుగా వుండి ఎంతకూ వూడిరాకపోవడంతో కాస్త గట్టిగా లాగాడు. చటుక్కున తెరుచుకుంది మూత. కానీ ఆ విసురికి వెనక్కిపడిపోయాడు. దాంతో పక్కనున్న పాత్రలు చెదిరిపోయాయి. అన్నం వొలికింది.

# గాలి



వైల్డ్ వెస్ట్‌విండ్ చాలా వినయంగా వొంగి
నా ముందుకు వస్తూంటోందా నేనప్పుడు
నిలువెత్తునా నా గ్రేవ్లోంచి లేచి షేక్‌హ్యాండిస్తానతనికి
చిత్రమేమిటంటే రెల్లుపొదలు ముంగుర్లు సవరించుకుంటాయి వీళ్లిద్దరి మధ్యా.

పూర్వం చందమామ పిట్టల వెగరేసిన వాడెవడో వాటినే కూల్చాడు
శాక్యమునిలా రెక్కల్నార్పేస్తున్నాడిపుడు
గుహ్యాంతర గుడిలో దీపాన్ని జవాల జవనాంగంగా ఊహించినవాడు ఆజన్మ బ్రహ్మచారి
ప్రాకారం చుట్టూ ప్రాణాచారం పడేవాడే నిజమైన బుద్ధుడు

ఓ నగ్నమునీశ్వరుడి కోసం లాకులెత్తిన
ఓ కవి పుంగవుడు నీళ్లల్లో తన మూత్రాన్ని మంత్రించాడు
ఆ వంతెన కింద నీళ్లని సాగుచేసే భూమికి సాకాడితడు
భూమికి తన యవ్వనాన్నిచ్చి పదునుచేసి తమకంలో

ప్రతీ దేహం ఒక దేశాన్ని సమీకరించుకుంటుంది
స్త్రీ ఒక అమూర్త మాతృదేహం కదా
ప్రతీ వృక్షం తన స్పేస్‌ని తానే క్రియేట్ చేసుకుంటుంది
ఫలాలు కావాలంటే నాన్నా నీ హృదయ హస్తాలు ఇంకా ఎదగాలి కదా
(వెల్తురు కోసం జీవనకాంక్షకోసం ఫలపుష్పాలకోసం ఒక లెంపకాయ కోసమైనా నీడగా పడుకున్న ఎడమ వక్షోజం కోసమైనా)

— 'మో'

నిశ్శబ్దంగా ఏడుస్తున్నాడు వాడు చెంపలమీది వాతని తడుముకుంటూ!

"ఛి ... ఛీ ... ఈ పిచ్చి వెధవతో వేగలేక ప్రాణాలు పోతున్నాయి" విసుగుతో అనిల్‌ని ఒక్క తోపు తోసేసి ఇటు తిరిగింది శ్రీలక్ష్మి.

ఎదురుగా కృష్ణప్రసాద్. ఆఫీస్ నుండి వచ్చి ఇంట్లో అడుగుపెట్టగానే వంటగదిలో గొడవ వినపడి చేతిలోని బ్రీఫ్‌కేస్‌తో సహా సరాసరి అక్కడికొచ్చాడు.

హఠాత్తుగా భర్తను అక్కడ అలా చూసేసరికి ఖంగుతింది శ్రీలక్ష్మి. తడబాటుని అణచుకుంటూ ఏదో సంజాయిషీ ఇవ్వడం కోసం నోరు తెరవబోయింది. ఆమె చెప్పేదేదీ తను వినవల్సిన అవసరం లేదన్నట్లుగా చేత్తో సంజ్ఞ ద్వారా వారించాడు. తీక్షణంగా భార్య కళ్ళల్లోకి చూస్తూ చెప్పాడు కృష్ణప్రసాద్—

"చూడు. నేను నిన్ను పెళ్ళి చేసుకున్నది నా బయొలాజికల్ నీడ్స్ తీర్చుకోవాలన్న వ్యామోహంతో కాదు. కేవలం ఆ పసివాడి ఆలన పాలన కోసం ఓ తోడు అవసరం అని. అదే నాకు అన్నిటికంటే ముఖ్యమైన విషయం — అని నీకు బాగా తెలుసు. ఆ సంగతి పెళ్ళికి ముందు స్పష్టంగా చెప్పాను కూడా. అయినా నువ్వీ మధ్య వాడ్ని బాగా నిర్లక్ష్యం చేస్తున్నావ్. ఏదీ తెలీని ఆ అమాయకుడి మీద జాలి లేకుండా ఎలా చేయి చేసుకోగలిగావ్ అసలు? ఇలా మళ్ళీ ఎప్పుడైనా జరిగితే ...... అయ్ జస్ట్ కాన్ట్ టాలరేట్"

భర్త గొంతులోని తీవ్రతకి వొణికిపోయిందామె ఓ క్షణంపాటు.

"రా అనిల్" అని కొడుకుని దగ్గరకు పిల్చి ఆప్యాయంగా వాడి బుగ్గలమీది కన్నీటిని వేళ్ళతో తుడిచి వాడి చేయి పట్టుకుని నడిపించుకుంటూ అక్కడ నుండి బయటికొచ్చాడు కృష్ణప్రసాద్. తండ్రి చేయి పట్టుకుని వెళ్తున్న అనిల్ వంక కోపంగా ఉక్రోషంగా చూస్తుండిపోయింది శ్రీలక్ష్మి.

** ** **


కృష్ణప్రసాద్ శ్రీలక్ష్మిలకు పుట్టిన బిడ్డ కాదు అనిల్. అతని మొదటి భార్య కీర్తనకు పుట్టిన బిడ్డ. కీర్తన కృష్ణప్రసాద్‌ల వివాహం పెద్దలు నిర్ణయించి చేసింది కాదు. పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో వాళ్ళిద్దరూ క్లాస్‌మేట్స్. 'తొలి చూపులో ప్రేమ' లాంటిదేమీ వాళ్ళమధ్య ఏర్పడకపోయినా, పి.జి. రెండో సంవత్సరంలో బాగా స్నేహితులయ్యారు వాళ్ళు. క్రమంగా ఆ స్నేహాలయంలో ప్రేమజ్యోతి వెలిగింది. స్కూళ్ళు, కాలేజీల్లో జాయినవ్వడానికైతే అప్లికేషన్ ఫారాల్లో "కులం కాలమ్" వుంటుంది గానీ ప్రేమ దరఖాస్తుల్లో ఆ కాలమ్ ఎక్కడా కనపడదుగా—అందుకేనేమో కులాలు వేరైనా వాళ్ళ మనసులేకమయ్యాయి. కీర్తన తల్లితండ్రులు పెళ్ళికి ఒప్పుకోలేదు. అతని కోసం ఆమె తనవాళ్ళనందర్నీ అన్నిటినీ వదిలేసుకుంది. వాళ్ళ పెళ్ళి ఓ గుళ్ళో స్నేహితుల మధ్య అతి సామాన్యంగా జరిగిపోయింది. పెళ్ళై తొమ్మిదేళ్ళు గడిచినా కీర్తన తల్లితండ్రులు ఆమె చేసిన 'తప్పు'ని క్షమించలేకపోయారు. కులాంతరవివాహం చేసుకుని కుటుంబగౌరవాన్ని భ్రష్టుపట్టించడమనే ఆ తప్పుకి శిక్షగా, కుటుంబంలోంచే కాకుండా వారి మనసుల్లోంచి కూడా వెలివేసేశారామెను. వాళ్ళ దృష్టిలో ఆమె అప్పుడే

చచ్చిపోయిందనుకున్నారు.' కాని రెండేళ్ళ క్రితం సెర్వికల్ క్యాన్సర్‌తో కీర్తన నిజంగానే చనిపోయినప్పుడు మాత్రం — గతాన్ని మరిచి కీర్తన శవాన్ని చూడడానికి వచ్చారు!

కృష్ణప్రసాద్‌కి కీర్తన మిగిల్చిపోయిన తీపి జ్ఞాపకం అనిల్. కానీ విధి ఆ తీపి జ్ఞాపకంలోనూ కొంత 'చేదు'ని రంగరించి కృష్ణప్రసాద్ పట్ల చాలా క్రూరంగా ప్రవర్తించింది! తల్లి చనిపోయేప్పటికి అనిల్‌కి ఆరేళ్ళు. వాడికి వయస్సుతో బాటు పెరిగేది శరీరం మాత్రమే. మేథస్సు కాదు. వాడొక మానసిక వికలాంగుడు. మెంటల్లీ రిటార్డెడ్! మానసిక ఎదుగుదల లేని 'పిచ్చివాడు'! వాడికి బాహ్య ప్రపంచం గురించి తెలీదు... అర్థం కాదు. ఎప్పుడూ ఏదీ మాట్లాడడు. ఏం చెప్తే అది గుడ్డిగా చేసేస్తాడు. మరుగుతున్న నీళ్ళని మీద పోసుకుంటే శరీరం కాలుతుందనీ, కత్తిపీటతో ఆటలాడితే చేయి తెగుతుందనీ, వెలుగుతున్న గేస్‌స్టవ్ మంటల్ని ముట్టుకుంటే ప్రమాదమనీ ఏమీ తెలీని పిచ్చివాడు! ఓ మనిషెప్పుడూ ఆతడ్ని కనిపెట్టుకుని వుండాలి. ఓసారి డాబా మీది నుండి ఆకాశంలో ఎగుర్తున్న పక్షిని "దా ... దా" అన్నట్లుగా చేత్తో పిలుస్తూ తల ఎత్తి ఆకాశంలోకే చూస్తూ క్రిందికి పడిపోబోయాడు. త్రుటిలో తప్పింది ప్రమాదం దైవికంగా. తెల్లగా సన్నగా పొడుగ్గా వుంటాడు. చిత్రం ఏమిటంటే మెదడు కణాలకు సంబంధించిన పెరుగుదల పూర్తిగా నిరోధించబడినా, ఆ ఈడు పిల్లలకన్నా బాగా పొడుగుగా వుంటాడు వాడు. కళ్ళల్లో దైన్యం గూడుకట్టుకుని వుంటుంది. వాడికి అన్నిటికంటే ఇష్టమైనవి మూడు. ఒకటి తండ్రి, రెండు — క్యాడ్‌బరిస్ చాకొలెట్, మూడు — ఆకాశంలో ఎగిరే రంగురంగుల గాలిపటం. స్టౌమీది నుండి వచ్చే నీలిరంగు మంటల్ని చూస్తే ఎందుకో వాటిని ఆర్పేయాలని చూస్తాడు. నోటితో గాలిని ఉఫ్ అని ఊదుతూ ఆర్పాలనుకోవడం కాదు. చేతుల్తోనే వాటిని 'నలిపి' అణిచివేయాలని 'పిచ్చి' ప్రయత్నం చేస్తాడు. అలా ఓసారి చేసి వేళ్ళు కొద్దిగా కాల్చుకున్నాడు కూడా!


కీర్తన పోయాక అనిల్ ఆలన పాలనా చూసుకోవడం చాలా పెద్ద సమస్యైంది కృష్ణప్రసాద్‌కి. ఒక ఆయాని పెట్టుకుని అతి కష్టం మీద ఓ సంవత్సరం పాటు సర్దుకు రాగలిగాడెలాగో! తన జీవితంలో కీర్తన పొందిన స్థానాన్ని మరో స్త్రీతో భర్తీచేయడానికి మనసు అంగీకరించకున్నా కేవలం అనిల్ కోసం, వాడికి కాస్త మదర్లీ కేర్ అందించాలన్న ఉద్దేశ్యంతో శ్రీలక్ష్మిని ఆర్నెల్ల క్రిందట పెళ్ళి చేసుకున్నాడు. ఓ ప్రభుత్వరంగ సంస్థలో ఆఫీసర్‌గా పనిచేస్తున్న కృష్ణప్రసాద్ కోసం పెళ్ళికాని కన్నె పిల్లలు సయితం ముందుకొచ్చినా — ఓ స్త్రీతో తొమ్మిదేళ్ళపాటు కాపురం చేసిన తను .... పెళ్ళి పట్లా, కాబోయే భర్త పట్లా నిర్దిష్టమైన అభిరుచుల్నీ ఆశల్నీ నర్స్ చేసుకుంటూ ఎన్నో వూహలతో ఎదురుచూసే కన్నెపిల్లని రెండో పెళ్ళి చేసుకోవాలంటే (వాళ్ళు మనసూర్తిగా అంగీకరించినప్పటికీ) ఏదో అస్పష్టమైన గిల్టీ ఫీలింగ్ కలిగేదతన్లో. మగాడు తనకు కాబోయే భార్య విషయంలో "పవిత్రత"ని ఎలా కోరుకుంటాడో స్త్రీ కూడా అలా కోరుకుంటుందనీ, అలా కోరుకోవడం చాలా సహజమైన విషయం అనీ అతని అభిప్రాయం. అందుకే అలాంటి సంబంధాల్ని కాదని శ్రీలక్ష్మిని పెళ్ళి చేసుకున్నాడు. ఆమె కూడా అతనిలానే భర్తని పోగొట్టుకున్న దురదృష్టవంతురాలు. పెళ్ళై నెల తిరక్కుండానే వైధవ్యపు చీకట్లు కమ్మేశాయామె జీవితంలో. హనీమూన్‌కి ఊటీ వెళ్ళి తిరిగి బస్సులో మైసూర్ వస్తూంటే జరిగిందా ప్రమాదం! బస్సు ఏదో బ్రిడ్జిమీదుగా వెళ్తున్నప్పుడు, ఎదురుగా వస్తున్న పెట్రోల్ టాంకర్‌ని తప్పిస్తుంటే స్కిడ్ ఐ క్రిందికి పడిపోయింది. బస్సు బ్రిడ్జిమీది నుండి క్రిందికి పడ్తుండగా ఓ లైవ్‌వైర్‌కి తగిలి బస్సులో అందరూ సజీవ దహనమై పోయారు. ఆ ఘోర ప్రమాదంలో చాలా ఆశ్చర్యకరంగా బ్రతికి బయటపడ్డ ఒకే ఒక్క జీవి శ్రీలక్ష్మి. శ్రీలక్ష్మి గతం చాలా టచింగ్‌గా అన్పించింది కృష్ణప్రసాద్‌కి. ఆమె గురించి చాలా ఆలోచించాడు. నేటి సమాజంలో మగాడు ఒకదాని తర్వాతొకటి డజను పెళ్ళిళ్ళైనా చాలా సులభంగా ఏ ఆక్షేపణలూ ఏ ఇన్హిబిషన్సూ లేకుండా హాయిగా జల్సాగా చేసేసుకోవచ్చు — చేసేసుకోగలడు! కానీ అదే ఆడదాని విషయంలో అయితే రెండో పెళ్ళనగానే ఎన్నో ఆటంకాలు — ఎన్నో సంఘపరమైన హేళనలు ... చిన్న చూపులు!!! భర్తను పోగొట్టుకున్న స్త్రీ మరో పెళ్ళికి సిద్ధపడడాన్ని ఈ సమాజం ఎందుకు "సహజమైన విషయం"గా హర్షించలేదో అర్థం కాదు. మగాడి విషయంలో అయితే అది చాలా "మామూలు" విషయం. ఎందుకీ వ్యత్యాసాలు?!

ఇలా ఆమె కోణంలోంచి ఎన్నో రకాలుగా ఎంతో ఉదాత్తంగా ఆలోచించి ఆమెను పెళ్ళి చేసుకున్నాడు కృష్ణప్రసాద్. అలా ఆమెను (రెండో) పెళ్ళి చేసుకోవడం ద్వారా మోడు వారిన ఆమె జీవితానికి కొత్త చిగుర్లు వేయించి, ఆమె జీవితాన్నేదో ఉద్ధరించినట్టుగా గొప్పగా ఎప్పుడూ భావించలేదతడు. మానసిక వికలాంగుడైన తన అనిల్‌కి ఆమె "అవసరం" ఎంతో వుంది. ఆమె ద్వారా ఆ "అవసరాన్ని" తను తీర్చుకునే ప్రోసెస్‌లో ఆమె వైధవ్యం తొలగిపోవడం అన్నది కేవలం యాదృచ్ఛికం మాత్రమే



అనుకునేవాడు! అంతటి గొప్ప సంస్కారం అతడిది. శ్రీలక్ష్మిని చాలా ప్రేమగా చూస్తాడు. ఆమె అభిరుచులకీ ఆలోచనలకీ విలువ ఇస్తాడు, గౌరవిస్తాడు. చాలామంది భర్తలు తమ భార్యల మీద టన్నుల కొద్దీ ప్రేమను ఒలకబోస్తారు కానీ భార్య అభిప్రాయాల్నీ ఆమె వ్యక్తిత్వాన్నీ గౌరవించడంలో శ్రద్ధచూపరు. ప్రేమగా చూడడం వేరు. గౌరవంగా చూడడం వేరు. భర్త భార్య వ్యక్తిత్వాన్ని గౌరవించడం అన్నది చాలా ఉన్నతమైన విషయం. అందుకేనేమో శ్రీలక్ష్మికి కృష్ణప్రసాద్ అంటే విపరీతమైన ఇష్టం ఏర్పడింది. కానీ ఆ విపరీతమైన ఇష్టమే పొసెసివ్‌గా కూడా మార్చిందామెను!

కృష్ణప్రసాద్‌తో వివాహమైన రెండుమూడు నెలల వరకూ అనిల్‌ని బాగానే చూసుకుంది. కానీ ఈ మధ్య అనిల్ అంటే విసుగు మొదలైంది. ఆ 'పిచ్చివాడ్ని' సాకడం చాలా ఇబ్బందిగా, భరించలేనిదిగా అన్పిస్తోంది. కృష్ణప్రసాద్‌తో ముడిపడ్డ తన పునర్జీవితానికి వీడొక 'గుదిబండ' అన్న అభిప్రాయం రోజురోజుకీ బలపడ్తోందామెలో. ఉలుకూ పలుకూ లేకుండా ఏం చెప్తే అది




గుడ్డిగా చేసేసే జడపదార్థంలా అన్పించే ఆ పసివాడంటే ఏవగింపూ, అలర్జీ పుట్టుకొస్తున్నాయి.

తన మొదటి భార్య కీర్తన రూపురేఖలు అనిల్‌లో వుండడం వల్లనో లేక ఆమెకు సంబంధించిన ఒకే ఒక్క సజీవ స్మృతి వాడే అవడం వల్ల వాడొక అపురూపమైన వ్యక్తిగా తోచడం వలనో గానీ భర్తకి అనిల్ అంటే చాలా ప్రేమని గ్రహించింది శ్రీలక్ష్మి. వాడి భద్రత గురించీ వాడి బాగోగుల గురించే భర్త ఎప్పుడూ ఆలోచిస్తాడని ఆమెకు తెలుసు. తన మీదకు అతని ధ్యాసని పూర్తిగా మళ్ళించుకోవాలని వుంటుందామెకు. తనని ఇంకా అధికంగా అతడు ప్రేమించాలనీ ఆరాధించాలనీ కోరుకుంటుంది. అసలు తమ మధ్య అనిల్ అనబడే గుదిబండ లేకుండుంటే జీవితాలెంత సాఫీగా ఎంత మధురంగా వుండి వుండేవో వూహిస్తుంటుంది. మొదట్లో అనిల్ పట్ల వుండే 'జాలి' స్థానంలో క్రమక్రమంగా విరాసక్తత జుగుప్సా విసుగూ పుట్టుకొచ్చాయి. అనిల్ తనకొక పరిష్కరించలేని సమస్యగా మారిపోయినట్లనిపిస్తోందామెకు!

వారం రోజుల తర్వాత ... ఓ నాటి రాత్రి — సమయం పదకొండుదాటినా, కృష్ణప్రసాద్ ఆఫీస్‌కి సంబంధించిన ఫైల్స్ ఏవో చూస్తూనే వున్నాడు. ఆఫీస్ పనిని అలా ఇంట్లో చేయడం అతనికేమీ కొత్తకాదు. శ్రీలక్ష్మి మెల్లిగా అడుగులో అడుగు వేసుకుంటూ భర్త వెనకగా




# గుడ్ ఫ్రైడే

చీకటి నిశ్శబ్దం
పెండెల్టన్ చర్చి ప్రహరీల్ని దాటి
గొప్ప అడావుడిగా
చలి దుమారమై వచ్చి
సువ్వుమని సువ్వుమని పాడుస్తున్నది
పాడుపు కథ-
ఒక కొయ్య శిలువ
తెల్లగా రాయసంగా ఊగి
రాత్రి కరకు పెదవులపై
బ్లాండ్ గ్రేషస్ కేథరిన్ నవ్వు లాగ విడివడితే
అబ్బురపడి ఈ కారు
రెప్పల్ని అల్లార్చి నిలబడిపోయింది.

మంచు రేకలు రేకలుగా పింజలు పింజలుగా
అంచుల్లేని నల్లటి బట్టమీద
మంచు అలవోకగా స్టైలిష్‌గా సప్ సప్‌మని తాకుతూ
నల్లటి
తెల్లటి
కట్టుకడపటి నిజం అనే పక్షి రాల్చిన
ముఖమల్ పాల ఈకల్లాగ
సీతానారం పాత బిర్జీ కాడ
పుష్పవేని ఇప్పించిన ఐస్క్రీము
పుష్పవేని తలదాల్చిన మల్లెచెండు

పుష్పవేని వర్షించిన మొలక నవ్వు వలె జల జల జల
గిలి గిలి గిలి
పదీ పదేమా పైనాపిల్స్ క్రీం జాస్మిన్ క్రీం పర్‌ఫ్యూమ్స్ క్రీం
వరసని
వణికే అమ్మమ్మ చేతి
వెన్న తియ్యని మజ్జిగ పొంగి తెలుపు అంతా
గతంలోని తెలుపు అంతా
జ్ఞాపికలై
నందివర్ధనాలు వెన్న ముద్దలు దీపం వొత్తులు
రేకలు ముక్కలు పింజలై
పొరలు పొరలుగా కాళ్ళకింద
అవలేచియన్ హిమశ్రేణి వర్షిల్లి
ఒంటి చుట్టూ అట్లాంటిక్ మంచు కదలి నర్తించి
'రా!రా!రా! చిట్టి కనకం రమ్మ'న్నవి
నాలోపల ఉక్కిరి బిక్కిరవు నిజం నన్ను
'లే!లే!లే! చిట్టికనకం లెమ్మ'న్నవి.

భయాల్ని ఒలుచుకొని
ఆశల్ని ఒలుచుకొని
అనుభవం లేని శక్తితోటి జోరుతోటి
పైకి వొచ్చేను
స్నోవానలో స్నానానికి జ్ఞానాపురం రాణిలా!



నారింజ ఎండలో మంచు
దారంతటా మెరిసింది
పాడుపుకథ విడిపోయింది
ధ్వాంతటటు అదే.

– కనకప్రసాద్

వచ్చి అతని భుజాల మీదు నుండి అరచేతుల్ని ఛాతీమీదికి జరుపుతూ గెడ్డాన్ని అతని మెడ ఒంపులో ఆన్చి "ఇంక ఆపేయకూడదూ. పడుకుందాం" అంది. ఆమె గొంతులోనూ, ఆ స్పర్శలోనూ గూఢంగా దాగివున్న 'కోరిక'ని చాలా సులభంగానే గ్రహించాడు కృష్ణప్రసాద్. చాలా ముఖ్యమైన ఆఫీస్ ఫైల్స్ తన ముందు న్నాయనీ వాటిని ఈ రాత్రికే పూర్తిచేయడం అవసరం అనీ తెలుసు అతనికి. అయినా కూడా భార్య మనోరథాన్ని అర్థం చేసుకుని ఆమెను డిజప్పాయింట్ చేయడం ఇష్టంలేక చదువు తున్న ఫైల్‌ని మూసేశాడు.

శ్రీలక్ష్మి ట్యూబ్‌లైట్ స్విచ్ ఆఫ్‌చేసి బెడ్ లాంప్ వేసింది. లేతాకు పచ్చరంగు వెలుగు గదిలో పరుచుకుంది. తన శరీరాన్ని అల్లుకు పోతున్న భార్య చేతుల్లోని బిగిని బట్టి అర్థమౌ తోంది కృష్ణప్రసాద్‌కి ఆమెలో వాంఛ ఎంతగా ఎగసిపడ్తోందో! ఆమె కనురెప్పలు అరమూతలు పడ్డాయి. ఆమె స్పర్శ అతన్లోనూ ఉద్రేకాన్ని పుట్టిస్తోంది. సరిగ్గా అప్పుడు విన్పించింది – పక్క గదిలోంచి అనిల్ పెట్టిన కెవ్వుమన్న కేక! అదేమీ పట్టించుకోకుండా శ్రీలక్ష్మి భర్తని ఇంకా ఇంకా తనలోకి ఇముడ్చుకోవాలని తమకంతో అతడ్ని ముట్టేస్తోంది. కొడుకు పెట్టిన కేక కృష్ణప్రసా ద్‌కి వినిపించింది. భార్యను పక్కకు విదిల్చి, లేచి గబగబా పక్కగదిలోకొచ్చాడు. అప్పుడొ చ్చింది శ్రీలక్ష్మి ఈ లోకంలోకి. కోరికల



నిప్పుల కొలిమిలో చల్లటి జడివాన కురిసినట్లైందామెకు. తెరుచుకుంటున్న స్వర్గద్వారాల్ని ఎవరో కర్కశంగా మూసేస్తున్న భావన! జరజరా పాకుతున్న ఆనందాల జాజితీగను కసుక్కున ఎవరో తెంపేస్తున్న ఫీలింగ్! తన గదిలో మంచం మీద వెల్లకిలా పడుకున్న అనిల్ ఎక్కడో శూన్యంలోకి చూస్తూ .... ఆ శూన్యంలోంచి ఏదో వికృతమైన రూపం తనని భయపెడ్తున్నట్లుగా వణుకుతోంది అతని శరీరం. వాడి నుదుటిమీద చుక్కలు చుక్కలుగా స్వేదం అలుముకుని వుంది. కళ్ళల్లో భయం. వేయి ఆక్టోపస్‌లు తనని చుట్టుముట్టేయడానికి వస్తుంటే 'వొద్దు, రావొద్దు' అన్నట్లు అతడి అరచేతులు భయంతో గజగజా వణుకుతున్నాయి. ''అనిల్''! కొడుకుని అలా ఆ స్థితిలో చూసి గాభరాగా మంచం దగ్గరకు పరిగెత్తుకొచ్చాడు కృష్ణప్రసాద్. ''ఏమైంది బాబూ?'' తండ్రి వైపు చూపు మరల్చలేదు అనిల్. ఇంకా సీలింగ్ వైపే చూస్తున్నాడు. ''అనిల్ ... అనిల్''! కొడుకు భుజం పట్టి కుదుపుతూ గట్టిగా పిల్చాడు కృష్ణప్రసాద్. అప్పుడొచ్చింది అనిల్ చూపులో కొంత మార్పు. క్షణంసేపు తండ్రి ముఖంలోకి తదేకంగా చూసి, ఒక్కసారిగా రెండు చేతుల్తోనూ కౌగిలించుకుని తండ్రి గుండెలకతుక్కుపోయాడు. భర్త వెనకే వచ్చి గుమ్మం దగ్గర ఆగిపోయి లోపల జరుగుతున్నదంతా ఉదాసీనంగా చూస్తోంది శ్రీలక్ష్మి. అనిల్‌ని చూస్తుంటే జాలికలగడం లేదామెకు. తన సంతోషానికి వాడొక పెద్ద అవరోధంలా అనిపిస్తోంది. ఏదో ఉక్రోషం ముందుకొస్తోంది.


''లక్ష్మి . .. నువ్వెళ్లు. నిద్రలో వాడికేదో పీడకల వచ్చినట్లుంది. నేను వీడి దగ్గర పడుకుంటాలే'' భార్య వైపు చూసి చెప్పాడు కృష్ణప్రసాద్. అనిల్‌ని నిద్రపుచ్చి మళ్ళీ తన దగ్గరకు వస్తాడులే అనుకుంటున్న శ్రీలక్ష్మికి భర్త మాటలు చెప్పలేని నిరాశను కలిగించాయి. శరీరంలో ఎక్కడో మినుకుమినుకుమంటూ వెలుగుతోన్న కోరికల మంట టప్పుమని ఆరిపోయింది. ఏదో అవ్యక్తమైన హృదయతాపం విపరీతంగా అశాంతి పరుస్తోందామెను. భరించలేని నిరాశ! తనకీ తన భర్తకీ మధ్య వుండే అరుదైన ప్రైవసీలో సయితం అనిల్ ఓ ఆటంకం కావడాన్ని సహించలేకపోతోంది. భర్త తనవొదిలేసి అనిల్ దగ్గర పడుకుంటున్నందుకు వాడిమీద అసూయ లాంటిది కలుగుతోంది! అదోలాంటి విచిత్రమైన




కాంప్లెక్స్! అనిల్ వైపు కోపంగా చూస్తూ అక్కణ్నుంచి కదిలింది శ్రీలక్ష్మి. ఆమె చూపులో అంతకు మునుపెన్నడూ కనిపించని క్రూరత్వం స్పష్టంగా కనిపిస్తోందాక్షణంలో!

నెల రోజులు గడిచాయి. ఓ రోజు..శ్రీలక్ష్మికి చాలా సంతోషంగా వుంది. తలంటు పోసుకుని అందంగా ముస్తాబై భర్త కోసం ఆత్రంగా వేచి చూస్తోంది. తన మనసులోని సంతోషాన్ని ఎప్పుడెప్పుడు భర్తతో పంచుకుందామా అని వుందామెకు. ఆ విషయం చెప్పగానే అతనెలా ప్రతిస్పందిస్తాడో రకరకాలుగా ఊహించుకుంటోంది. సినిమాల్లోలాగ అమాంతం రెండు చేతుల్తో పైకెత్తి గాల్లో తనని గిరగిరా తిప్పేసేంతగా సంబరపడిపోడేమోగానీ తప్పకుండా సంతోషిస్తాడని తెలుసామెకు. నిజానికామెకు డాక్టర్ నిర్ధారణ చేసిన ఆ విషయం కంటే, దాన్ని భర్తకు తెలియచేయబోతున్నానన్న ఫీలింగ్ ఎక్కువ పులకింతగా వుంది. జడలో తురుముకున్న జాజిదండ ఆమె గుండెల్లోని సందడిలా విరబూసి, చిరునవ్వులు వెదజల్లుతోంది. ఆరున్నరకి వచ్చాడు కృష్ణప్రసాద్. అంతకు ముందుదాకా ఎప్పుడెప్పుడా సంగతి అతనికి చెప్పాలా అనుకుంది గానీ తీరా అతను వచ్చేసరికి ఎలా చెప్పాలబ్బా అన్న ఆలోచనలో పడిందామె. అతను టై ముడి వదులుచేసుకుంటుండగా అతని పక్కనే ఆనుకుని కూర్చుని చెప్పేసింది శ్రీలక్ష్మి కాస్త సిగ్గుపడుతూ. అది వినగానే భర్త ముఖం సంతోషంతో విచ్చుకోకపోవడం ఆమె మనసుని చివుక్కుమనిపించింది. గుండెలో ఏదో సున్నితమైన భాగం గాయపడిన భావం! అతడోసారి ఆశ్చర్యంతో కనుబొమల్ని ముడిచి ''నిజమా?'' అనడిగాడు. అది నిజమవ్వకుంటేనే బాగుండును అన్న అర్థం అతడడిగిన తీరులో స్పష్టమౌతున్నట్లుగా అనిపించిందామెకు.

''ఇవాళ హాస్పిటల్ కెళ్ళాను. డాక్టర్ కన్‌ఫర్మ్ చేసేసింది'' అని చెప్పింది. అతనేమీ మాట్లాడలేదు. క్షణంసేపు నిశ్శబ్దం తరువాత అడిగాడు — ''నువ్వు హాస్పిటల్ కెళ్ళినపుడు అనిల్‌ని ఎక్కడుంచావ్?'' ఆ సందర్భంలో భర్త దగ్గర



నుండి అనిల్‌కి సంబంధించిన ప్రస్తావన వస్తుందని అస్సలూహించలేదు శ్రీలక్ష్మి. తను తొలిసారిగా గర్భవతిని కావడం అన్న విషయానికి కూడా ప్రాధాన్యత నివ్వకుండా అనిల్ గురించి అడగడం ఆమె మనసుని భగ్గున మండించింది!

"నాతోబాటు తీసుకెళ్ళాను" అబద్ధం చెప్పేసింది శ్రీలక్ష్మి. నిజానికి ఆమె — అనిల్‌ని వాడి గదిలోనే వుంచి క్యాడ్‌బరీస్ చాకొలెట్ ఒకటి వాడి చేతికిచ్చి బయట తలుపు బోల్టు పెట్టేసి హాస్పిటల్‌కి వెళ్ళింది.

"ఇప్పుడెన్నో నెల?" అడిగాడు.


"రెండు నిండాయి."

కాసేపు ఇద్దరి మధ్యా మౌనం. శ్రీలక్ష్మితో తనకు వివాహమైన మొదటి రాత్రిని గుర్తు తెచ్చుకున్నాడు కృష్ణప్రసాద్.

ఆ మొదటి రాత్రి...

ఏదో గాఢమైన ఆలోచనలో మునిగిపోయి పరధ్యానంగా బెడ్ మీద కూర్చుని వున్న తన దగ్గరకొచ్చి శ్రీలక్ష్మి అడిగింది — "ఏమిటి దిగులుగా వున్నారు?"

"ఏం లేదు."




"నన్ను రెండో పెళ్ళి చేసుకోవడం ద్వారా కీర్తన పట్ల అన్యాయంగా ప్రవర్తించానేమోనన్న గిల్టీ కాన్షస్సా?"

కీర్తన గురించి ఆమె కన్నీ చెప్పాడు తను. కానీ అంతలోతైన ప్రశ్న ఆమె నుండి ఎదుర్యాడని తను ఆశ్చర్యపడ్తూ "అదేం లేదు. అనిల్ గురించి ఆలోచిస్తున్నాను. నా దిగులంతా వాడి గురించే" అన్నాడు.

"అనిల్ గురించి మీరేం బాధపడకండి. కంటికి రెప్పలా నా కన్నబిడ్డలా చూసుకుంటాను. కీర్తన బ్రతికుంటే ఎంత ఇదిగా చూసుకునేదో అంతగా చూసుకుంటాను. ఒకవేళ నాకూ నా సొంత బిడ్డలు పుట్టుకొస్తే అనిల్‌ని నిర్లక్ష్యం చేసి సవతి తల్లిలా చూస్తాననే భయం మీకుంటే... నాకసలు పిల్లలే పుట్టకూడదని కోరుకుంటాను."

ఆనాటి ఆమె మాటల్లో ఎంతో నిజాయితీ



కన్పించిందప్పుడు. కాని అది నిజం కాదు. నటన. అఫెక్టేషన్! కేవలం తన ప్రేమనీ, అభిమానాన్నీ గెలుచుకోవాలన్న ఓ రకమైన స్వార్థంతో చెప్పిన మాటలవి. అంతే!

"ఏవిటాలోచిస్తున్నారు? నేను తల్లిని కాబోతున్నానన్న సంగతి తెలిసి మీకు సంతోషంగా లేదా?"

శ్రీలక్ష్మి అడిగిన ఆ ప్రశ్నకి ఉలిక్కిపడి తన ఆలోచనల్ని తెంపి ఈ లోకంలోకి వచ్చాడు కృష్ణప్రసాద్.

"సంతోషంగాలేకేం. అయామ్ రియల్లీ హేపీ. కానీ ఒక్క విషయం. ఇప్పుడు నీ కంటూ ఓ సొంత బిడ్డ పుట్టబోతున్నాడని అనిల్‌ని అలక్ష్యం చేయొద్దు. వాడు అందర్లాంటి వాడు కాదని నీకు తెల్సు. వాడిని మాత్రం ఇల్‌ట్రీట్ చేయొద్దు. అదే నేకోరుకునేది."

ఆ మాటలు చెప్పేసి మౌనంగా తన గదిలో కెళ్ళిపోయాడు కృష్ణప్రసాద్.

సరిగ్గా అప్పుడు కలిగింది శ్రీలక్ష్మిలో ఆ ఆలోచన! అనిల్ ఈ ఇంట్లో వున్నంతకాలమూ, భర్త ఆత్మీయతావాత్సల్యం 'తన బిడ్డ'కు దక్కవ్! అతడి హృదయంలో అనిల్‌కే ఎప్పుడూ ప్రథమ స్థానం. అనిల్ తర్వాతే తనైనా, తన బిడ్డైనా? భర్త ప్రేమని పూర్తిగా తన వైపుకి మళ్ళించుకోవాలంటే అనిల్ వుండకూడదీ ఇంట్లో. తనకు కలగబోయే బిడ్డ భవిష్యత్తుకి కూడా వాడొక అడ్డు అవుతాడనడంలో సందేహం లేదు. అనిల్ అనబడే ఆ "ఎనిమిదేళ్ళ మాంసపు ముద్ద" వల్ల ఎవరికీ ఏ సంతోషమూ, ఉపయోగమూ లేవు. బతికినన్నాళ్ళూ మరొకరికి భారంగా వుండాల్సిందే వాడు. వాడు శాపగ్రస్తుడై తన బతుక్కొక శాపంలా చుట్టుకున్నాడు. భర్త ప్రేమా, అతని ధ్యాసా కేవలం తనకూ, తన బిడ్డకూ మాత్రమే 'పరిమితం' చేసుకోవాలనే ప్రగాఢమైన కోరిక ఆమెలో ఆ క్షణాన ఎంత బలంగా నాటుకుందంటే — అనిల్ పీడ విరగడయ్యేందుకు తక్షణం ఏదో ఒకటి చేసేయాలన్న స్థిరమైన నిర్ణయానికొచ్చేసిందామె!!

* * *

ఆ మర్నాడు —

మలక్‌పేటలో వుండే తన తల్లి తరపు దూరపు బంధువొకాయనకి ఫోన్ చేసి రమ్మని చెప్పింది శ్రీలక్ష్మి. అతడ్ని అంకుల్ అని పిలుస్తుందామె. తులసీరాం అతని పేరు. అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా చేస్తున్నాడు. నేసుకునే ఖాకీ దుస్తుల్ని కేవలం తన వ్యక్తిగత స్వార్థానికి, తన




జేబుల్నింపుకోవడానికీ మాత్రమే ఉపయోగించుకోవడమెలాగో బాగా తెలిసిన వ్యక్తి అతడు. క్రిమినల్స్‌ని పట్టుకోవలసిన అతడి బుర్రలో ఎప్పుడూ నేరాలోచనలే! డబ్బు కోసం ఎంత నీచానికైనా నొడికట్టగల మనీ - మనస్తత్వం! ఏ లాభం లేకుంటే ఏ పనీ చేయడు. ఏదో లాభం వుందంటే ఎలాంటి పనైనా చేసే డబ్బు-మానియాక్! అక్రమంగా డబ్బు సంపాదించే మార్గాల మీద వంద థీసిస్‌లు వ్రాయగల "జనరల్ నాలెడ్జి" వున్నవాడా తులసీరాం!! ఆ రోజే మధ్యాహ్నం పన్నెండవుతున్నప్పుడొచ్చాడు తులసీరాం. శ్రీలక్ష్మి సమస్యని పూర్తిగా విన్నాడతడు. కుడి చేతి బొటన వేల్తో నుదుటి మీద నెమ్మదిగా నొక్కుకుంటూ నిమిషం సేపు ఆలోచించాడు. మెరుపులాంటి ఆలోచన కలిగిందా మెదడులో శ్రీలక్ష్మి వైపు కొంచెం వంగి మెల్లగా చెప్పాడు.

"నువ్వు చెప్పింది కరెక్టే. ఆ కుర్రాడికి బుద్ధీ, జ్ఞానం సరిగా వుండి మానసికంగా ఆరోగ్యవంతుడై వుండివుంటే అంత సమస్యగా వుండుండకపోను. కానీ ఓ పిచ్చివాడిని సాకడం ఎవరికైనా భారమే. నువ్వు వినే వుంటావ్ ఇంగ్లీషులో 'యు థనేషియా' అనే ఓ మాట వుంది. అంటే — తీవ్రమైన నయం చేయలేని రోగంతో బాధపడేవాళ్ళని దయతో తేలిగ్గా చంపేయడం!! మెర్సీ కిల్లింగ్! అది తప్పేం కాదు. కొందరి విషయాల్లో అది తప్పనిసరి కూడా."

"ఛఛ.. వాడిని వొదిలించుకోవడమంటే — హత్య చేయడమా. అమ్మో వద్దు. మానసిక వికలాంగుల పునరావాస కేంద్రాల్లాంటిన వాట్లో నొదిలే..."

"దానికి మీ ఆయనొప్పుకుంటాడా? నిన్ను పెళ్లి చేసుకోకముందు కొన్నాళ్ళు అలాంటి రిహేబిలిటేషన్ సెంటర్లో వుంచాడట కదా?... ఒక వేళ వాడ్ని అక్కడొదిల్నా... అది నీ సమస్యకు శాశ్వత పరిష్కారం కాదు. నేను చెప్పేది సరిగా అర్థం చేసుకో. అనిల్ వల్ల ఎవ్వరికీ ఏ సుఖమూ లేదు. వాడున్నంత కాలం నీకు శాంతీ, విశ్రాంతీ రెండూ వుండవ్. ఆ గుదిబండని జీవితాంతం మోస్తూండటం చాలా అన్యాయం. వాడ్ని వొదిలించుకోవడం ద్వారా మనం కొంత డబ్బు పొందే అవకాశం కూడా వుంది. ఎలాగంటే రోడ్ ప్రమాదాల్లో మరణించిన వాళ్ళ కుటుంబానికి కోర్టు ద్వారా నష్టపరిహారం వస్తుందన్న సంగతి నీకు తెల్సే వుండొచ్చు. అనిల్‌ని మనం ఓ పబ్లిక్ రోడ్ మీద ఏదో ఒక మోటారు వాహనం క్రింద పడి ప్రమాదవశాత్తూ చనిపోయేలా ఏర్పాటుచేయగలిగితే — టు బర్డ్స్ ఎట్ వన్ షాట్‌లా ... నీకా పిచ్చివాడి పీడా విరగడౌతుంది, కోర్టు ద్వారా సుమారు ఓ లక్షదాకా నష్టపరిహారమూ వస్తుంది."

"ఏ కోర్టు? అసలలా ప్రమాదవశాత్తూ పడి చనిపోయేలా ఎలా ఏర్పాటు చేస్తాం?"

"విపరీతమైన ట్రాఫిక్ వుండే ఓ రద్దీ రోడ్ మీద జీబ్రా లైన్స్ లేని చోట ఆ కుర్రాడ్ని రోడ్ క్రాస్ చేయమని చెప్తాం."

"రోడ్ క్రాస్ చేయడానికి వాడొప్పుకోకపోతే..."

"వాడికి చాక్‌లెట్స్ ఇష్టం అన్నావుగా. అవి ఆశ చూపుదాం. ఒక్కసారి రోడ్ దాటి రాగలిగితే రెండు చాక్‌లెట్స్ ఇస్తాం అని చెబ్దాం."

"మనలాటి వాళ్ళకే అలాంటి చోట రోడ్ దాటడం కష్టం అనుకో కానీ వీడి అదృష్టం బాగుండీ వా ఖర్మకాలీ వాహనాల్ని తప్పించుకోగలిగితే?"

"నో ఛాన్స్. వాడి రెండు చేతుల్నీ నిక్కరు జేబులో పెట్టించి, కళ్ళు గట్టిగా మూసేసుకోమని చెప్పి అలా కళ్ళు మూసుకునే రోడ్ దాటాలని చెప్పాలి. మధ్యలో కళ్ళు తెరిచేస్తే చాక్‌లెట్స్ ఇవ్వం అని భయపెడ్దాం. తెగిన గాలిపటంలా ఏదో ఒక వెహికిల్‌కి గుద్దుకుని ఛావడం ఖాయం. అనిల్ మానసికంగా ఆరోగ్యంగానే వున్నట్లు ఓ డాక్టర్ సర్టిఫికెట్ పుట్టించి కోర్టులో ఎగ్జిబిట్ చేస్తే సరి-అధమం లక్ష గ్యారంటీ!"

"ఏమో! ఆ గొడవంతా నాకు తెలీదు. అసలు

ఆ కోర్టులూ, ట్రిబ్యునల్సూ ఇచ్చే నష్టపరిహారాల డబ్బు మీద నాకు ఆశ లేదు. నాక్కావలస్సింది ఎలాగో ఒకలా ఆ శనిగ్రహాన్ని వదిలించుకోవడం. అంతే!''

''సర్లే... అదంతా నేన్చూసుకుంటాలే. కానీ ఓ షరతు. ఈ ఒక్క 'దెబ్బ'కూ నేలకూలే రెండు పిట్టల్లో ఒకటి నీది, రెండోది నాది. అనిల్ పీడ విరగడవ్వడం నీకైతే, కోర్టు వాళ్ళిచ్చే కాంపెన్సేషన్ డబ్బు నాది. సరేనా?''

తల ఊపింది శ్రీలక్ష్మి.

''ఇదంతా మనం చేయడానికి ముందు నీ మీద నీ భర్తకి అనుమానం రాకుండా వుండేందుకు ఒక 'గ్రౌండ్' తయారుచేసుకోవాలి మనం. అదేంటో చెబ్తాను. దగ్గరకు రా.''

శ్రీలక్ష్మి తులసీరాం వైపుకి వంగింది. ఆమె చెవిలో అతడేదో చెప్పాడు రహస్యంగా!

* * *

ఆ మర్నాడు కృష్ణప్రసాద్ ఇంటికి వచ్చి రాగానే చెప్పింది శ్రీలక్ష్మి.

''అనిల్ ఈ మధ్య చాలా అల్లరిగా తయారౌతున్నాడు. బాగా గాలిపటాల పిచ్చి పట్టుకుంది. ఈవేళేమైందో తెల్సా? నేను స్నానం చేసొస్తాను. నేనొచ్చేవరకూ ఎక్కడికీ వెళ్ళకు అన్జెప్పి బాత్రూమ్ కెళ్ళొచ్చేసరికి ఇంట్లో లేడు. ఇల్లంతా వెదికినా ఎక్కడా కనపళ్ళేదు. హడలిపోతూ ఇంటికి తాళం పెట్టి రోడ్ మీదికి పరిగెత్తాను. మెయిన్ రోడ్ మీద నవ్వుకుంటూ గాలిపటాన్ని ఎగరేసే ప్రయత్నం చేస్తున్నాడు. అంత హెవీ ట్రాఫిక్‌లో ఏ వెహికిలో గుద్దేస్తే ఇంకేమైనా వుందా?''

భార్య చెప్పింది విని నిర్ఘాంత పోయాడు కృష్ణప్రసాద్. తన బిడ్డ భవిష్యత్తు తల్చుకోగానే ఎందుకో అతని గుండె వణికింది. అనిల్ మీద మొదటిసారిగా కోపం వచ్చింది. కోపం కూడా కాదది. అసహాయతతో కూడిన విసుగు!


''ఎక్కడున్నాడు వాడు?'' భార్యనడిగాడు.

''తన గదిలో నిద్రపోతున్నాడు.''

టై ముడి విప్పుతూ గబగబా అనిల్ గది వైపు వెళ్తున్న భర్త వంక చూస్తూ అలాగే నిలబడిపోయింది శ్రీలక్ష్మి. ఆమె పెదాల మీద కనిపించీ కనిపించనట్లుగా పల్చని నవ్వు! తనాడిన అబద్ధాన్ని భర్త సులభంగా నమ్మేశాడన్న సంబరంతో కూడిన క్రూరమైన నవ్వు!!

తులసీరాం చెప్పిన పథకంలో మొదటి అంకం పూర్తయింది.

* * *



# కొత్త సేద్యం

రెండు స్తబ్దక్షణాల మధ్య
ఒలికిన ఆనందాన్ని ఎత్తుకునే లోపున
ఏదో ఓ ఘటనకు రాలిపడ్డ అశ్రువులు
విషాదానికే సంకేతం కాదు
కొత్త మార్గానిక్కూడా

రెండు మనః పుష్పాల పరిమళాల గాఢత
ఒకటి శూన్యానికి జారిపోయి
ఒకటి అనంత విశ్వానికి
ఎగిరిపోయినప్పుడు
ఏ విప్పపూల స్పర్శకో తూలిపడటం
ఓ ఎదుగుదల అనుభవమే

హృదయ మైదానంలో
కురిసే అనుభూతుల వర్షానికి
ఉప్పొంగాల్సిన జీవనదులు
వేసవి తాపాల్లాంటి చూపులకి
ఆవిరవడం విభ్రాంతికే కాదు
కొత్త జ్ఞానానికీ జన్మ స్థానాలౌతాయి

ఎదిగిన చెట్లు
పూసిన తురాయిల్ని
అనాథల్లా రాల్చేస్తున్నప్పుడు
భూమ్మీద పడి ఇంకిన కన్నీళ్ళే
కొత్త తోటని సేద్యం చేస్తాయి.

— ఎన్.ఎన్. శ్రీనివాసరావు

ముందుగా వేసుకున్న పథకం ప్రకారం అనిల్ పీడ శాశ్వతంగా వదిలించుకునే 'పని' పూర్తి చేయాలని శ్రీలక్ష్మి, తులసీరాంలు నిర్ణయించుకున్న రోజది!

కృష్ణప్రసాద్. ఉదయం పది గంటలప్పుడు ఆఫీస్‌కి బయల్దేరి వెళ్ళగానే తులసీరాం దగ్గర్నుండ ఫోన్ వచ్చింది. ఓ అరగంటలో తను ఇక్కడికి వస్తున్నట్లూ, సిద్ధంగా వుండమనీ, ఆ పిచ్చోడినీ (చావుకి) సిద్ధం చేయమనీ శ్రీలక్ష్మికి గుర్తుచేశాడతడు ఫోన్లో.

రిసీవర్ ఫోన్ మీద పెట్టేసిందగ్గర్నుంచీ టెన్షన్‌తో కాళ్ళూ చేతులూ ఆడటం లేదు శ్రీలక్ష్మికి. గుండెల్నిండా విచిత్రమైన ఉద్విగ్నత నిండుకొని వుంది. అనిల్ పీడ ఈ రోజుతో వదిలిపోతోందన్న సంతోషం మనసులో వున్నా ఆ వదిలించుకునే ''పద్ధతి'' ద్వారా తనొక హంతకురాలుగా మారిపోతున్నానేమోనన్న అస్పష్టమైన అపరాధ భావన ఆమె సబ్‌కాన్షస్‌లో లీలగా కదలాడుతూ ఆమెను కుదిపివేస్తోంది! పెనుతుపానప్పటి సముద్ర గర్భంలో అల్లకల్లోలంగా ఉందామె మనస్థితి!

హాల్లో నేల మీద వెల్లకిలా పడుకుని సీలింగ్ వైపు పిచ్చి చూపులు చూస్తూ కుడి చేతి చూపుడు వేలితో గాలిలోనే సున్నాల్లా చుడుతున్నాడు అనిల్. వాడి ఒంటి మీద షర్టు లేదు. నిక్కరొక్కటే వుంది. ఇంకొన్ని నిమిషాల్లో తనను 'చంపేయబోతున్నార'ని ఏ మాత్రం తెల్సుకోలేని ఆ పసివాడు అమాయకంగా అలా గాలిలో సున్నాలు చుడ్తూనే వున్నాడు!

శ్రీలక్ష్మి వాడి వైపు ఓసారి చూసింది. వాడికి షర్టు వేయాలి అనుకుంది. కాఫీ కలుపుకుని తాగి ఆ తర్వాత వేద్దాంలే అనుకుని వంట గదిలోకి వచ్చింది. అగ్గిపుల్లతో స్టౌ వెలిగించి చిన్న స్టీలు గిన్నెలో కాసిని నీళ్ళు పోసి బర్నర్ మీద వుంచింది డికాక్షన్ కోసం. స్టౌ రెగ్యులేటర్‌ని 'ఆన్' నుండి సిమ్‌కి మార్చడం మర్చిపోవడం వల్లా, బర్నర్ మీద పెట్టిన పాత్ర మరీ చిన్నది కావడం వల్లా, మంట పాత్ర అంచుల్ని దాటి పైపైకి రావడాన్ని శ్రీలక్ష్మి గమనించలేదు. (ఆమె గనుక అది గమనించి తగు జాగ్రత్త తీసుకుని వుండి వుంటే... ఈ కథకి ముగింపు మరోలా వుండి వుండేదేమో?!)

తులసీరాంతో కల్సి ఇంకాసేపట్లో తను చేయబోతున్న 'ఆ పని' నిర్విఘ్నంగా పూర్తి అవుతుందా లేదా అన్నదాని మీదే నిలిచి వున్నాయామె ఆలోచనలన్నీ. తెగిన గాలిపటంలా, అనిల్‌ని నడి రోడ్ మీదికి వదిలేస్తున్న సమయంలో ఎవరైనా తమని

పట్టేసుకుంటే?!

వరాలు చిట్లిపోతాయేమోనన్నంత టెన్షన్‌గా వుందామె ఆ సమయంలో. ఆ గేస్ స్టౌకి కొంచెం అవతల వున్న కాంప్లాన్ టిన్‌కి పెట్టిన మూత వదులుగా తెరిచి పెట్టినట్లుగా వుండడం గమనించి కాస్త ముందుకు వంగి దాని మూతని గట్టిగా బిగించి పెట్టింది. ఆమె అలా వంగడంలో అనుకోకుండా భుజాల మీది నుంచి పైట కొద్దిగా జారడం, మండుతున్న స్టౌ మీద అది అంటీ అంటనట్లుగా పడడం త్రుటిలో జరిగిపోయింది. కాంప్లాన్ టిన్‌కి మూత బిగించి దాన్ని కుదురుగా ఓ పక్కన సర్ది పక్కకు తిరగబోతున్నప్పుడు అనిపించింది శ్రీలక్ష్మికి — నడుం దగ్గర వేడిగా తగులుతున్నట్లు! ఉలిక్కిపడి ఇటు తిరిగి చూసే సరికి... అప్పటికే మంటలు కొంగంతా పాకేస్తున్నాయ్!

ఆ హఠాత్పరిణామానికి షాక్‌తో కొయ్యబారిపోయిందామె. అనిల్‌ని అంతమొందించే పథకాన్ని అమలుచేయబోతున్నామనే ఉద్విగ్నతలో ఏవేవో ఆలోచనల్తో నిండి వున్న ఆమెకి హఠాత్తుగా ... అస్సలూహించని ఈ ప్రమాదం ఆమెను భయకంపితురాల్ని చేసింది! ఆ 'ప్యానిక్'స్థితిలో ... ఏం చేయాలో అర్థంకాని అయోమయంలో... భుజాల మీది పైట కొంగుని వేళ్ళతో విదిల్చి కిందికి వేసింది. అదే ఆమె చేసిన తప్పు! అనాలోచితంగా ఆమె అలా విసిరికొట్టిన పైట కొంగు వెళ్ళి కాళ్ళకుచ్చెళ్ళ దగ్గర పడింది. అంతే! క్షణంలో కుచ్చెళ్ళకూడా మంటలంటుకున్నాయి. అప్పుడు తెల్సిందామెకి... తను చేసిన పొరబాటేమిటో! తను కాలిపోవడం తథ్యం అన్న సంగతి స్పష్టంగా తెల్సిపోతూంటే... కెవ్వుమన్న ఆక్రందన ఆమె గొంతులోంచి ఒక్కసారిగా వచ్చింది.

సరిగ్గా అప్పుడే... అనిల్ ఆ గదిలోకి వచ్చాడు.

ఎర్రటి ఆ మంటల్ని చూడగానే, వాటితో ఆటలాడుకోవాలనుకున్నాడో లేక ఆ మంటల వల్ల ఆమె కాలిపోతుందని రక్షించాలనుకున్నాడో గానీ... పరిగెత్తుకుంటూ వెళ్ళి ఆ మంటల మీద దబ్ మని పడిపోయాడు వాడు. శ్రీలక్ష్మి రెండు కాళ్ళనీ చుట్టేసి, ఆ మంటల్ని చేతుల్తో గుద్దేస్తున్నాడు. కసిగా మండే చీరని నలిపేస్తున్నాడు- అదోలాటి ఉన్మాదంతో! ఆ పసివాడి లేత శరీరం ఆ మంటల మీద ఓ కంబళిలా పడేసరికి కొంతవరకు అవి ఆరిపోవడంతో శ్రీలక్ష్మి మనసు నావరించిన చావు భీతి కొద్దిగా సడలినట్లైంది. జరుగుతోందేమిటో అర్థమౌతోంది. కనీసం ఒంటి మీద షర్టు కూడా లేని వాడి ఒళ్ళు ఆ వేడి



కథలు దాదాపు ఎవరేనా రాసుకోవచ్చేమో, ఎవరికి వారు పాడుకున్నట్టు. కానీ, మంచి కంఠం, రాగజ్ఞానం, తాళజ్ఞానం ఉన్నవారు పాడితేనే ఇతరులు వినగలుగుతారు.

—కాళీపట్నం రామారావు
'కథా కథనం'

సెగలకి నల్లగా మారి చిట్లిపోతున్నా... అదేం పట్టించుకోవడం లేదా 'పిచ్చివాడు!' 'పిచ్చి'గా ఆ మంటలతో 'ఆడు' కుంటూనే వున్నాడు- అవి పూర్తిగా ఆరి పోయేవరకూ!

* * *

నర్సింగ్ హోమ్.

బర్న్స్ వార్డ్‌లో... స్పృహ లేకుండా బెడ్ మీద పడి వున్న అనిల్ ముఖం వంకే తదేకంగా చూస్తోంది శ్రీలక్ష్మి. సెలైన్ డ్రిప్ మెల్లిగా అనిల్ శరీరంలోకి ఎక్కుతోంది బొట్లు బొట్లుగా. అనిల్ వైపు చూస్తున్న కొద్దీ శ్రీలక్ష్మిలో అంతకుముందెన్నడూ కలగని జాలి మొదటిసారిగా కలుగుతోంది. కళ్ళల్లోకి అప్రయత్నంగానే నీళ్ళూరిపోతున్నాయి. కొన్ని నిమిషాల క్రితం వరకూ వాడిని చంపి శాశ్వతంగా ఆ పీడ విరగడ చేసుకోవాలని ఆరాట పడింది. కానీ ఆ పిచ్చివాడే అనుకోకుండా తన ప్రాణాన్ని 'కాపాడడం' అన్న నిజం ఆమె కళ్ళకు కట్టిన స్వార్థపు పొరల్ని ఒక్కసారిగా ఛేదించి నట్లుగా అయింది. ఆ పసివాడి 'పిచ్చితనమే' తననీనాడు భయంకరమైన చావు నుండి తప్పించిందన్న స్పృహ మనసుకి స్పష్టమౌతున్న కొద్దీ ఓ రకమైన పశ్చాత్తాపం ఆమె మనసంతా ఆవరిస్తోంది. గుండె అట్టడుగు పొరల్లో నిద్రాణమైన మానవత్వం కనులు విప్పుతోంది.

వాడే గనుక అప్పుడా మంటలపై పడి "పిచ్చిగా ప్రవర్తించక" పోయుంటే తనీపాటికి కాలిన శరీరంతో, వికృతంగా మారి ప్రాణాపాయ స్థితిలోనైనా వుండేది లేక ప్రాణాలు పోయి శవమైపోయైనా వుండేది. నాలుగు రోజుల క్రిందట న్యూస్ పేపర్లలో వేసిన కాకతీయ ఎక్స్‌ప్రెస్ బండిలో జరిగిన అగ్ని ప్రమాదం తాలూకు కాలిపోయి వికృతంగా మారిపోయిన శవాల ఫోటోలు కళ్ళ ముందు మెదిలాయి ఓ క్షణకాలం!! ఆ జ్ఞాపకమే ఆమె శరీరాన్ని వణికించేసింది.

తను హతమార్చాలనుకున్న ఆ పసివాడే తనను రక్షించాడు. రక్షించాలన్న ఉద్దేశ్యంతో ప్రయత్నపూర్వకంగా తనను రక్షించాడో లేదో తెలీదు కానీ ప్రమాదం నుండి రక్షింపబడడానికి వాడి పిచ్చి చేష్ట, వాడి మానసిక వైకల్యమే పరోక్షంగా కారణమవ్వడం మాత్రం నిజం!

అసలు ఆ పసిపిల్లాడ్ని చంపాలన్న క్రూరమైన ఆలోచన తన మనసులోకెలా వచ్చింది? అంత అమానుషంగా ఎలా ఆలోచించగలిగింది తను?

ఈ అగ్ని ప్రమాదమే జరగకుండా వుంటే ఈ పాటికి వాడు ఏ మోటారు వాహనం చక్రాల క్రిందో నలిగి దారుణంగా చనిపోయి వుండే వాడేగా? అంటే... తనో 'హంతకురాలై' పోయి వుండేది! అలా ఆ హత్య జరగకుండా వున్నప్పటికీ తను 'హంతకురాలే'! ఒక మనిషిని చంపాలన్న ఆలోచన మనసులో రావడం అంటూ జరిగిందంటే... అది చాలు- "మానసికంగా" తను హంతకురాలే!

ఆ ఆలోచన ఆమె ఆడ మనసుని కంపింపచేస్తోంది. ఒక్కసారిగా అపరాధ భావం ఆమె హృదయాన్ని ఆవరించేసింది.

ధారాపాతంగా... ఆమె కన్నులు వర్షిస్తున్నాయి.

స్వార్థం ముసుగులో కప్పబడిపోయిన విచక్షణా జ్ఞానం కళ్ళు తెరుస్తోందామెలో. "తను", "తన కుటుంబం', "తన పిల్లలు" అనే ఐ-సెంటర్డ్‌నెస్ నుండి బయటపడి, మనిషిలా మానవతతో ఆలోచిస్తోందామె మనసిప్పుడు!

తప్పు చేసామన్న భావన మనస్ఫూర్తిగా కలిగితే మాత్రం... ఆ స్థితి చాలా ఎగొనైజింగ్‌గా వుంటుం దొక్కోసారి. అశాంతి, క్షోభ మనసుని నిలువనీయవు. అపరాధ భావననేది ఆ భావనలోని 'నిజాయితీ'ని బట్టి... ఒక్కో సందర్భంలో అన్ని బాధలకంటే ఎక్కువ క్షోభ రగిలిస్తుందని చెప్పడానికి అప్పటి శ్రీలక్ష్మి మానసిక స్థితే ఓ చక్కని తార్కాణం!

చిరుగాలి అలలా స్వల్పంగా రేగిన ఆ గిల్టీ భావం క్షణ క్షణానికీ ఆమెలో పెరిగిపోతూ ఓ ప్రభంజనంలా, ఓ పెను తుపానులా మారి ఆమెలోని 'ఆడ గుండె'ని తూట్లు పొడుస్తోంది!

ఆ గుండె ఇప్పుడు ప్రాయశ్చిత్తాన్ని కోరుతోంది.

ప్రాయశ్చిత్తం అన్న మాట మనసులో మెదల గానే, అదెలా చేసుకుంటే తన మనస్తాపం తీరి ప్రశాంతత చేకూరుతుందో వెనువెంటనే తట్టిందామెకు. "అవును. తనలా చేయాలి" గట్టిగా నిర్ణయించేసుకుంది శ్రీలక్ష్మి. కళ్ళ నుండి జారుతోన్న కన్నీటి స్రవంతిని చీరకొంగులో ఇముడ్చుకుని... నర్సింగ్‌హోమ్‌కి బయట ఓ మందుల షాపు దగ్గరున్న పబ్లిక్ టెలిఫోన్ దగ్గరకొచ్చింది.

తులసీరాం నంబర్ తిప్పింది. శ్రీలక్ష్మి ఫోన్ కోసమే ఎదుర్చూస్తున్న తులసీరాం వెంటనే లైన్‌లో కొచ్చాడు. శ్రీలక్ష్మి గొంతు వినగానే...

"ఏవిటెక్కడికెళ్ళావ్. మీ ఇంటి కొచ్చి చూశాను. నువ్ లేవు. తలుపు తాళం వేసి వుంది. మనం ఈ వేళ ఆ పిచ్చివాడ్ని మెర్సీ మర్డర్ చేసేద్దాం అనుకున్నాంగా?" అనడిగాడు.

"అదే అంకుల్... ఆ విషయం గురించే... నీకో సంగతి చెప్పాలని..."

"ఏం... ఇవాళ కుదరదా? మీ ఆయనకేమైనా అనుమానమొచ్చిందా కొంపదీసి?"

"అదేం కాదు. అనిల్‌ని వదిలించుకోవాలన్న ఆలోచనే నాలో లేదిప్పుడు. ఇహ అలాంటి ఆలోచన లీలగా కూడా నా మనసుకి రాదు. ఆ పసివాడి చావులో నుంచి కూడా కొంత డబ్బు పిండుకుని లాభం పొందాలనుకున్న నిన్ను నిరాశ పరుస్తున్నందుకు సారీ. బాబు... అదే... ఆ మానసిక వికలాంగుడు... ఇక నుండీ నా కన్నబిడ్డే!"

ఇంకా ఎక్కువేం మాట్లాడకుండా ఫోన్ పెట్టేసింది శ్రీలక్ష్మి.

*  *  *  *

సరిగ్గా నాలుగు రోజుల తర్వాత డిశ్చార్జ్ చేశారు అనిల్‌ని. వాడికి ఏం కాకూడదని మనస్ఫూర్తిగా దేవుడ్ని వేడుకుంది శ్రీలక్ష్మి.

అనిల్‌ని హాస్పిటల్ నుండి ఇంటికి తీసుకొచ్చిన మర్నాటి రాత్రి...

సమయం పదకొండవుతోందప్పుడు.

అనిల్ గదిలో... ఇంకా పూర్తిగా మానని వాడి కాలిన గాయాల మీద పై పూతగా డాక్టరు ఇచ్చిన ఆయింట్‌మెంట్ పూసి, వాడి మీద దుప్పటి సరిగ్గా కప్పి బెడ్‌రూమ్‌లో కొచ్చింది శ్రీలక్ష్మి. ఆమె ముఖంలో గత నాలుగైదు రోజుల క్రిందట వున్న అపరాధ భావన తాలూకు బాధ కన్పడడం లేదిప్పుడు. చాలా ప్రశాంతంగా వున్నట్లనిపిస్తోంది.

పరుపు మీద వెల్లకిలా పడుకుని కుడి ముంజేతిని నుదుటి మీద అడ్డంగా పెట్టుకుని




పైన తిరుగుతున్న ఫాన్ వంక చూస్తూ ఏదో ఆలోచనలో వున్న భర్త గుండెల మీద వాలిపోయి

"ఏమిటాలోచిస్తున్నారు?" అనడిగింది మెల్లగా.

భార్య వంక ఇష్టంగా చూసి చిర్నవ్వుతూ ఏం లేదన్నట్లుగా తల అడ్డంగా ఊపాడు కృష్ణప్రసాద్. ఆ ప్రమాదం జరిగినప్పటి నుండీ భార్యలో కలిగిన 'మార్పు'ని అతడు గమనిస్తూనే వున్నాడు. అనిల్ పట్ల విసుగు ప్రదర్శిస్తూ ఎప్పుడూ చిరాకు పడ్తూండే శ్రీలక్ష్మి ఇప్పుడు వాడ్ని చాలా బాగా చూసుకోవడంతో అతనికి తృప్తిగానూ, ప్రశాంతంగానూ వుంది. రేపు శ్రీలక్ష్మికి ప్రసవమై ఓ బిడ్డ పుట్టినా అనిల్ పట్ల తన బాధ్యతలను విస్మరించదనే నమ్మకం కలుగుతోందతనికి.

ఓ నిముషం నిశ్శబ్దం తర్వాత శ్రీలక్ష్మి తలెత్తి భర్త కళ్ళల్లోకి చూస్తూ చెప్పింది.

"మన మొదటి రాత్రి- నేను మీకు ప్రమాణంలా చేయకపోయినా ప్రామిసింగ్‌గా ఓ మాట అన్నాను. తప్పకుండా గుర్తుండే వుంటుంది."

హఠాత్తుగా ఆ ప్రస్తావన తీసుకొచ్చేసరికి కొంచెం ఆశ్చర్యంగా భార్య వంక చూశాడు కృష్ణప్రసాద్.

"అనిల్‌ని నా కన్నబిడ్డలా చూసుకుంటాననీ, ఒకవేళ నాకు నా సొంత బిడ్డలుపుట్టుకొస్తే అనిల్‌ని నిర్లక్ష్యం చేసి స్టెప్ మదర్లీగా ట్రీట్ చేస్తాననే భయం మీకుంటే, నా కస్సలు పిల్లలే పుట్టకూడదని కోరుకుంటాను అన్నాను. గుర్తుంది కదూ?"

ఇప్పుడా విషయాన్ని ఎందుకు కదిల్చిందో అంతు పట్టలేదు కృష్ణప్రసాద్‌కి. ఆశ్చర్యంతో అతని భ్రుకుటి ముడిపడింది. పడుకున్న వాడల్లా లేచి కూర్చుంటూ 'గుర్తుంది' అన్నట్లుగా తలూపాడు.

"కానీ నేనే మరిచాను ఆ మాటల్ని. అనిల్‌ని ఇన్నాళ్ళూ చాలా బాధ పెట్టాను, తిట్టాను; కొట్టాను. ఆ పసి మనసుని ఎంతో టార్చర్ చేశాను. అమానుషంగా ప్రవర్తించి చాలా పాపం మూట కట్టుకున్నాను. దానికి ప్రాయశ్చిత్తంగా- ఆనాడు ఏదో ఆవేశంతో నేను చెప్పిన ఆ మాటల్ని నిజం చేయాలనుకున్నాను. అందుకే అనిల్ హాస్పిటల్‌లో అడ్మిట్ అయిన మర్నాడే లేడీ డాక్టర్‌ని కలిశాను. నాలో ఇప్పుడిపుడే ప్రాణం పోసుకుంటున్న ఆ 'జీవకణాల సముదాయాన్ని' వద్దనుకుని నా నుంచి దూరం చేసేసుకున్నాను - ఓ చిన్ని ఆపరేషన్ ద్వారా!"

శ్రీలక్ష్మి మాటల సారాంశం అర్థమయ్యేసరికి ఆశ్చర్యంతో అతడి మెదడు మొద్దుబారిపోయింది.

శ్రీలక్ష్మి ఇంతటి త్యాగం చేస్తుందని అతడప్పలు ఊహించలేదు. అసలలాంటి త్యాగం ఆమె చేయాలని సబ్-కాన్షస్‌గా కూడా ఎప్పుడూ ఆశించ లేదతడు. నమ్మశక్యం కానిదేదో విన్నట్లుగా నిర్ఘాంతపోతూ మూగగా భార్య వంక చూస్తున్నాడు.

ఓ పథకం ప్రకారం తను అనిల్‌ని హత్య (దానికి 'మెర్సీ కిల్లింగ్' అనే ముద్దు పేరు పెట్టుకుని) చేయాలని ప్రయత్నించడం గానీ, ఆ పాపానికి పరిహారంగానే తనింత పని చేయగలిగిందని గానీ భర్త దగ్గర చెప్పలేకపోయింది శ్రీలక్ష్మి. అయినా కూడా ఆమె మనసిపుడు ప్రశాంతంగా వుంది. అతి దారుణమైన గిల్టీ భావనను తప్పించుకున్న తృప్తి అది!

"నా కింటూ వేరే పిల్లలిక అక్కర్లేదండీ. అనిల్ నా కన్నబిడ్డే. ఆ ఒక్కడూ చాలు నాకు."

భర్త ఒడిలో ఒదిగిపోతూ మనస్ఫూర్తిగా చెప్పిందా మాటలు!!

(మానసిక వికలాంగుల మీద రవ్వంత జాలీ, కరుణా కలిగి, వారి పునరావాసానికి సహృదయంతో చేయందించే ప్రతి మంచి మనసుకీ ఈ కథ అంకితం)